క్లుప్తంగా

జాబ్‌బాక్స్‌తో యువతకు ఉద్యోగావకాశాలు


జాబ్‌బాక్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐవైఎం సభ్యులు

మండపేట: స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జాబ్ బాక్స్ పనిచేస్తుందని ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ మండపేట అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ అన్నారు. జాబ్‌బాక్స్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం స్థానిక సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వృత్తిపరమైన స్కిల్స్, శిక్షణకు సంబంధించిన సమాచారాన్ని జాబ్ బాక్స్ అందిస్తుందన్నారు. ఉద్యోగ సమాచారాన్ని అప్ టూ డేట్ సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యదర్శి జాబిర్, సభ్యులు పాల్గొన్నారు.

వెంకటాయపాలెంలో 'పొలంబడి'


వెంకటాయపాలెంలో సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పొలం పరిసరాల విశ్లేషణపై అవగాహన కల్పించారు. అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు రేవతి, రైతులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

రామచంద్రపురం రూరల్: ప్రస్తుత సీజన్‌లో శివారు గ్రామాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా ఇరిగేషన్ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు శీలం రమణ కోరారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఏఓ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంట నమోదు కార్యక్రమం మొదలైందన్నారు. పశు వైద్యాధికారి రామచంద్రరావు మాట్లాడుతూ పశువులకు బీమా నమోదు చేయించుకోవాలని వివరించారు.

దాతల సహకారం ఎనలేనిది


మైక్‌సెట్‌ను బహూకరిస్తున్న చెల్లుబోయిన రాంబాబు

కాజులూరు: పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదని గొల్లపాలెం జెడ్పీ పాఠశాల హెచ్ఎం ఎస్ఎస్‌బీ సుశీలమణి అన్నారు. ఆ పాఠశాలకు శుక్రవారం గ్రామానికి చెందిన శ్రీకాకతీయ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ చెల్లుబోయిన రాంబాబు రూ.15 వేల విలువైన మైక్‌సెట్‌ను బహూకరించారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు దాత రాంబాబును సత్కరించారు. స్కూల్ స్టాఫ్ సెక్రటరీ పి.సత్యనారాయణ, పీడీ సునీల్‌కుమార్, కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికే పౌష్టికాహారం అందజేత


కేదారిలంకలో పౌష్టికాహార కిట్లు అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

కపిలేశ్వరపురం: టేక్ హోమ్ రేషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేయడం ప్రయోజనకరమని నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు అన్నారు. కేదారిలంకలో శుక్రవారం పోషకాహార కిట్లను వారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పొలిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

పాలతోడులో టీడీపీ ప్రచారం

మండపేట: తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహాశక్తి కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నాయకులు శుక్రవారం మండలంలోని పాలతోడులో పర్యటించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, మాజీ ఎంపీపీ గోసాల సుజాత, పిల్లా తాత తదితరులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి స్థానికులకు టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు.

బాగుబడి.. సరికొత్త ఒరవడి

- అన్ని వసతులతో అందంగా ప్రభుత్వ పాఠశాలలు
- 'నాడు-నేడు' పథకంలో స్కూళ్లకు కొత్త శోభ
- ఉన్నత విద్యలో ఇంటర్న్‌షిప్‌తో నైపుణ్యత
- సంతోషంలో విద్యార్థులు, తల్లిదండ్రులు



రంగులతో ఆకర్షణీయంగా ఉన్న అద్దంకివారిలంక ప్రాథమిక పాఠశాల


వెదురుమూడి యూపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

కపిలేశ్వరపురం: ఒకప్పుడు ప్రభుత్వ బడిలో చదవడం అంటే కొందరు నామోషీగా భావించేవారు. బడి బాగోదని, సదుపాయాలు ఉండవని, పుస్తకాలు ఇవ్వరనీ, పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండదని ఇలా అనేక మాటలు మాట్లాడేవారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ మాటలన్నీ మూగబోయాయి. కార్పొరేట్ పాఠశాలల్లో సైతం లేని సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. డిజిటల్ పాఠాలతో నూతన ఒరవడిలో విద్యాబోధన సాగుతోంది. అందుకోసం ఉపాధ్యాయులకు తరచూ శిక్షణ ఇస్తున్నారు. చదువులో నాణ్యతే కాకుండా విద్యార్థి రూపు రేఖల్లో సైతం ఆధునికత కనిపిస్తోంది. కపిలేశ్వరపురం మండలంలో ప్రభుత్వ విద్యలో మెరుగుదలపై ఈ కథనం...

ప్రభుత్వ విద్యకు సాంకేతికత

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, విద్యాబోధన, అనుబంధ కార్యకలాపాలను పూర్తి సాంకేతికతతో అనుసంధానం చేశారు. మండలంలోని కపిలేశ్వరపురం, వాకతిప్ప, మాచర, టేకి, నల్లూరు, కాలేరు, వల్లూరు, అంగర పాఠశాలలకు చెందిన 429 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కటి రూ.15 వేల విలువ చేసే ట్యాబ్, బోధన కంటెంట్‌లను ఉచితంగా అందజేసింది. 1 – 5 తరగతుల విద్యార్థుల కోసం స్మార్ట్ టీవీలు, 6–10 విద్యార్థుల కోసం ఐఎఫ్‌పీలను అందజేశారు. వాటిని వినియోగిస్తూ పాఠం చెప్పేందుకు మండలంలోని 155 మంది ఉపాధ్యాయులకు జూలై 1 నుంచి 15 వరకూ శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్న భోజనం పథకంలో వడ్డించే ఆహార పదార్థాల నాణ్యతను ఆన్‌లైన్‌లో ఫొటోల అప్‌లోడ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

3,600 మందికి జగనన్న విద్యా కానుకలు

మండలంలోని 51 పాఠశాలల్లోని 3,600 మంది విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న విద్యా కానుక పేరుతో విద్యా ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేసింది. షూ, యూనిఫాం, నోట్సు, పాఠ్య పుస్తకాలను పాఠశాల తెరవగానే అందజేసింది. యూనిఫాం కుట్టుకూలి ఖర్చులను సైతం ప్రభుత్వమే భరించింది.

మెరుగైన ఫలితాల కోసం..

జిల్లా పరిషత్ రూపొందించిన పదో తరగతి మెటీరియల్ జగనన్న విద్యా భారతి పేరుతో ఉచితంగా అందజేస్తున్నారు. మెటీరియల్ తమకెంతో ప్రయోజనకారిగా ఉందంటూ 2022-23 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కపిలేశ్వరపురం మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల్లోని 595 మంది పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు.

సత్తా చాటుతున్న సర్కారీ స్కూళ్ల విద్యార్థులు

2023లో ట్రిపుల్ ఐటీకి మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతిలో 600 కి 574 మార్కులు సాధించిన వంగా బాంధవి రమ, 572 మార్కులు సాధించిన శలా గీతికారత్నం, 569 మార్కులు సాధించిన యర్రా దివ్య తేజశ్రీ , వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 573 మార్కులు సాధించిన బొల్లంరెడ్డి సాయితేజలు ట్రిపుల్ ఐటీకి ఎంపికై ఆయా ప్రభుత్వ పాఠశాలకు పేరు తెచ్చారు.

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రగతి ఇలా...

గ్రామాలు	19
ప్రాథమిక పాఠశాలలు	37
ప్రాథమికోన్నత పాఠశాలలు	06
ఉన్నత పాఠశాలలు	08
51 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు	3,600
తొలి విడత 'నాడు-నేడు' పాఠశాలలు	18
రెండో విడత 'నాడు-నేడు' పాఠశాలలు	32
'నాడు-నేడు' పథకంలో చేసిన ఖర్చు	రూ.10.78 కోట్లు
2023లో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు	04

పాఠశాల భలేగా ఉంది



నేను అద్దంకివారిలంక ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. మా పాఠశాల ప్రైవేటు పాఠశాల కంటే అందంగా ఉంటుంది. స్మార్ట్ టీవీలో పాఠాలు చెబుతున్నారు. కుర్చీలు, డెస్కులు కొత్తవి వేశారు. ఏ మాత్రం పాఠశాల ఇతర పాఠశాలలకు తక్కువ కాదన్నట్టు ఉన్నవి. చాలా సంతోషంగా ఉంది.

– కె.అనూష , అద్దంకివారిలంక

విద్యా స్థాయిని పెంచేందుకు కృషి



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యా స్థాయిని పెంచేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు, పాఠశాలలను మెరుగుపరచడం ద్వారా సర్కార్ కృషి అభినందించతగినది.

– పలివెల మధు, అచ్యుతాపురం

ఈ-పంట నమోదు తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సూర్యనారాయణ


తర్లంపూడిలో పంటల నమోదు చేస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

కె.గంగవరం: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ- పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు ఇళ్ల సూర్యనారాయణ సూచించారు. శనివారం కె.గంగవరంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం ఏఓ బలుసు రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ అధికారి, సహాయకుల సమక్షంలో ఈ- పంట నమోదు జరుగుతుందన్నారు. రైతులు సహకరించి వివరాలు తెలియజేయాలని కోరారు. రైతులకు విత్తనాలు అందించాలన్నా, పంట నష్టపరిహారం ఇవ్వాలన్నా, రాయితీలు అమలు కావాలన్నా, రైతు భరోసా పథకం అందాలన్నా ఈ-పంట నమోదు ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. చిరుధాన్యాల పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచడంలో భాగంగా ప్రభుత్వం రాగులు, కొర్రలు కొద్ది మొత్తంలో ప్రయోగాత్మకంగా పంపిణీ చేయడానికి సిద్ధమైందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల ఉద్యాన అధికారి ఎం.అనూష, ఇరిగేషన్ ఈఏ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు: గ్రామాల్లో తొలకరి పంట సాగు చేస్తున్న రైతులంతా తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని జేడీఏ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. తర్లంపూడిలో శుక్రవారం ఆయన పర్యటించి పంటల నమోదును పరిశీలించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి వి.అశోక్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన రైతులతో మాట్లాడారు. మండలంలో 19,500 ఎకరాల సాగు భూమికిగానూ 17 వేల మంది రైతు ఖాతాలు ఉన్నాయన్నారు. వీరందరూ తప్పనిసరిగా ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ లేనిపక్షంలో ప్రభుత్వం పథకాల అమలులో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కరప ఏడీఏ కె.బాబూరావు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చెయ్యండి

కాజులూరు: గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం నుంచి 27వ తేదీ వరకూ జరుగనున్న ఈశా గ్రామీణ క్రీడా గ్రామోత్సవాలను విజయవంతం చెయ్యాలని ఈశా ఫౌండేషన్ కాకినాడ జిల్లా సమన్వయకర్త సరాల సాగర్ అన్నారు. శుక్రవారం ఆ గ్రామంలో సంస్థ ఏరియా కోఆర్డినేటర్ కాయల నరసింహమూర్తి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజులూరు, కరప, తాళ్లరేవు, పెదపూడి మండల నుంచి క్రీడాకారులు పాల్గొనున్నారన్నారు. వీరిని 30 జట్లుగా విభజించి 12, 13వ తేదీలలో వాలీబాల్ తదితర క్రీడా పోటీలు, 27న మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కర్రసాము, కోలాటం, తొక్కుడు బిళ్ల తదితర పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

కౌమార బాలికలకు అవగాహన సమావేశం


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దేవిరాజశ్రీ

రాయవరం: కౌమార బాలికలకు మండలంలోని లొల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం జోస్యుల రాధాకృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారి దేవిరాజశ్రీ విద్యార్థినులకు కౌమార వయస్సులో ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. 12 రకాల పరిశుభ్రత అంశాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

కొత్తపేట: కోడి పందేలపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఏఎస్సై ఐ.బ్రహ్మాజీరావు తెలిపారు. వానపల్లి శివారు సంఘంపాలెం ఏటిగట్టు సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఈబీ అధికారులు ఈ దాడి చేశారన్నారు.

ఆత్మీయ స్వాగతం



వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు శుక్రవారం అమలాపురానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వానం పలుకుతున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు



మండపేటలోని బంకులో పెట్రోల్ నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఎస్ఓ సుబ్బరాజు

మండపేట: మండపేట పట్టణం, మండలంలోని పెట్రోల్ బంకుల్లో శుక్రవారం పౌరసరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎంఎస్ఓ సుబ్బరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు బంకుల్లో, మండలంలోని రెండు బంకులను పరిశీలించారు. వినియోగదారులకు అందిస్తున్న సదుపాయాలు, పెట్రోల్, డీజిల్ నాణ్యత, పరిమాణం తదితర అంశాలను తనిఖీ చేశారు. పలు బంకుల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, అగ్నిప్రమాద నివారణకు సంబంధించి గడవు తీరిన సిలిండర్లను వినియోగిస్తున్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఓ సుబ్బరాజు మాట్లాడుతూ మండపేటలో పెట్రోల్ బంకుల నిర్వహణపై అందిన ఫిర్యాదులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. తమ పరిశీలనలో గుర్తించిన లోపాలపై కేసులు నమోదు చేశామన్నారు. పెట్రోల్ బంకుల్లో వినియోగదారులతో సిబ్బంది మర్యాదగా నడుచు కోవాలన్నారు. ఉచిత గాలి, శుభ్రమైన టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతపై వినియోగదారులు కోరితే పరీక్షించుకునేందుకు ఫిల్టర్ పేపర్ అందించాలని తెలిపారు.

ప్రగతి బాటలో పల్లెలు

- సీఎం జగన్ పాలనలో సాధ్యం
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి


కొత్తపేటలో మండల పరిషత్ ఆర్చి గేటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లె సీమలు ప్రగతి వైపు పరుగులు తీస్తున్నాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు ఆధ్వర్యంలో శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మండల పరిషత్ ముఖద్వారంలో కొత్తగా నిర్మించిన ఆర్చి గేట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో పేదల జీవితాలకు వెలుగులు వచ్చాయన్నారు. తాజాగా సున్నా వడ్డీ పథకం కింద రాష్ట్రంలో సుమారు 1.06 కోట్ల మంది డ్వాక్రా సంఘాల మహిళలకు రూ 1,353.76 కోట్లు విడుదల చేశారన్నారు. అభివృద్ధిలో మండలాన్ని ఆదర్శంగా తీసుకు వెళ్తున్న ఎంపీపీ గంగాధరరావును అభినందించారు.

మహనీయుల త్యాగాలు స్మరిద్దాం

స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులను స్మరించుకుందామని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఎంపీపీ గంగాధరరావు ఆధ్వర్యంలో నాభూమి- నాదేశం, నేల తల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్తూపాన్ని ఆవిష్కరించి అక్కడ దీపాలు వెలిగించి అమర వీరులకు నివాళులర్పించారు.

వ్యవసాయ ఉపకరణాల పంపిణీ


నేలటూరులో రైతులకు విత్తనాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సాగు సలహా మండలి సమావేశం నిర్వహించారు. మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, నక్కా సింహాచలం, వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ సాగు నీరు అందించడం నుంచి పంట చేతికందే వరకూ ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తోందన్నారు. సాంకేతిక, క్షేత్ర స్థాయి సమస్యలేమైనా ఉంటే మండలి, లేదా అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధం ఇరిగేషన్, ఉద్యాన శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రైతులకు వ్యవసాయ ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో నేలటూరు సర్పంచ్ కుక్కల వీరన్న, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు రుద్రాక్షుల వీరగౌరీకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి కిశోర్, రైతులు పాల్గొన్నారు.

గర్వించేలా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

రాయవరం: స్వేచ్ఛా భారతావని గర్వించేలా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. సోమేశ్వరం, మాచవరం, పసలపూడి పంచాయతీ సర్పంచులు ఆరిఫ్, కత్తుల సీతామహాలక్ష్మి, కడలి పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లయిన సందర్భంగా అమరుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాభూమి నా దేశం..నేల తల్లికి నమస్కారం..వీరులకు వందనం కార్యక్రమాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించుకోవడం ద్వారా అమర వీరులను స్మరించుకున్నామన్నారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పరిచిన చెరువుల వద్ద నిర్మించిన శిలాఫలకాల వద్ద పూజలు చేశారు. చెరువు వద్ద మొక్కలు నాటారు. అలాగే ఆయా గ్రామాల్లో మట్టిని సేకరించి, మండలానికి పంపించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల ఉప సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధి హామీ కూలీలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పసలపూడిలో సీనియర్ సిటిజన్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

స్వాతంత్ర్యయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి

కపిలేశ్వరపురం: స్వాతంత్ర్యోద్యమ నాయకుల నుంచి నేటి యువత స్ఫూర్తి పొందాలని 'నా భూమి–నా దేశం' కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వాకతిప్ప పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం పేరుతో శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, సర్పంచులు కొరిపెల్ల వెంకట నాగస్రవంతి, చోడే రామతులసి, తిరునాతి ఆదిలక్ష్మి, సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు గొల్లపల్లి సోనియా, వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టా మురళి పాల్గొన్నారు. కపిలేశ్వరపురంలో సీనియర్ సిటిజన్లను సత్కరించారు.


కపిలేశ్వరపురంలో సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

నేల తల్లిని కాపాడుకుందాం..

రామచంద్రపురం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక 9వ సచివాలయం వద్ద మన భూమి– మన దేశం కార్యక్రమాన్ని శుక్రవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేల తల్లిని కాపాడుకునేందుకు మొక్కలు పెంచాలని సూచించారు. కౌన్సిలర్లు కొండేపూడి సూర్యకుమారి, గాదె రామలక్ష్మి, మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం..

కె.గంగవరం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎంజీఎన్ఆర్‌జీఎస్ ఈసీ సాగర్, సర్పంచ్ అనుసూరి సాయి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మన భూమి– మన దేశం కార్యక్రమంలో భాగంగా పంచాయతీల వద్ద పంచ్ ప్రాణ్ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచభూతాలను కలుషితం చేయడం వల్ల మానవాళి జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు కాలుష్య నివారణలో భాగస్వాములు కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు స్వాతంత్ర్యోద్యమ కీర్తిని చాటే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. టీఏ భవాని, ఉప సర్పంచ్ నిడదవోలు సుజాత తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో నా భూమి- నా దేశం కార్యక్రమంలో చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు

అంబాజీపేట: ఓ కారు అదుపుతప్పి ముక్కామల వద్ద పంట కాలువలోకి దూసుకుపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ జలం చెరువుకు చెందిన పిల్లి సుధీర్‌బాబు, పిల్లి అనిల్, కె.బాబి, కట్టా ప్రసాద్‌లు కారులో వెళ్తున్నారు. ముక్కామల వచ్చేసరికి వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకుపోయింది. కట్టా ప్రసాద్‌కు తప్పా మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అంబాజీపేట పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జయ్యింది.

మహిళ ఆచూకీ లభ్యం

ఆలమూరు: మడికిలో ఈ నెల 5న అదృశ్యమైన కోరుకొండ అప్పలనరసమ్మ (43) ఆచూకీ లభ్యమైంది. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం.. స్థానిక నాగులపేటలో నివసిస్తున్న చెముడు, మూగ దివ్యాంగురాలైన ఆమె ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు అనకాపల్లి జిల్లా చింతపల్లిలో తమ బంధువుల ఇంటికి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఆమెను తీసుకువచ్చి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.